
కిరాక్..


హెచ్‌సీయూలోని నూతనంగా నిర్మించిన ఆంఫీ థియేటర్

హెచ్‌సీయూలో శిల్పం చెప్పే చిత్రాలెన్నో..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రత్యేకతను సంతరించుకుంది. విద్య, పరిశోధన రంగాల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులున్నాయి. నగర శివారు గచ్చిబౌలిలో 2,300 ఎకరాల విశాల స్థలంలో 1974లో యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. శివారులో పురాతన రాతి సంపద, గ్రీనరీ ప్రాంతం కావడంతో పక్షులు, జంతువులకు ఆలవాలంగా ఉంది. ఇందులో వైట్‌రాక్స్, మష్రూమ్ రాక్, వర్జిన్ రాక్, టెంపుల్ రాక్స్ ఉన్నాయి. కాగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన పురాతన రాక్‌లలో ఒకటి మష్రూమ్ రాక్. ఇది హెరిటేజ్ రాక్‌గా కూడా గుర్తించగా.. ఐకానిక్ రాక్‌గా పేరొందింది. క్యాంపస్‌లో 4 చెరువులు ఉన్నాయి. అమరవీరుల చిహ్నంగా కార్గిల్ చౌక్ కూడలిని ఏర్పాటు చేశారు. అలాగే 100 ఫీట్ల జాతీయ పతాకంతో పాటు కప్, సాసర్ ఆకృతులు ఆకట్టుకుంటున్నాయి. పచ్చని చెట్ల మధ్య భారీ కొండపై గాలిలో తేలియాడుతున్న స్టెయిన్‌లెస్ స్టీల్ శిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇక్కడ పలు శిల్పాలను పూర్వ విద్యార్థి, శిల్పకారుడు ధీరజ్ రూపొందించాడు.





ఆంఫీ థియేటర్ సమీపంలో రాతిపై స్టీల్‌తో తయారుచేసిన శిల్పం


హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద 100 అడుగుల జాతీయ పతాకం


క్యాంపస్‌లో రోడ్డు పక్కన మనిషి శిరస్సు బొమ్మ


ప్రభుత్వం గుర్తించిన 'మష్రూమ్ రాక్' ఇదే..


హెచ్‌సీయూలో కప్‌సాసర్ కూడలి


హెచ్‌సీయూలో పచ్చందాల నడుమ ఆకర్షిస్తున్న స్టాచ్యూ




ప్రధాన గేటు- రోడ్డు మధ్యలో రాతిపై హెచ్‌సీయూ లోగో

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీలో 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్' ఏర్పాటు

రాయదుర్గం: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ కోసం ట్రిపుల్ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు శనివారం ట్రిపుల్ఐటీ హైదరాబాద్, గోల్డ్‌మన్‌సాచ్‌లు సంయుక్తంగా నిర్ణయించారు. ట్రిపుల్ఐటీ హైదరాబాద్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ జవహర్ మాట్లాడుతూ గోల్డ్ మ్యాన్ సాచ్ సహకారంతో ఏఐ యొక్క అప్లికేషన్స్, ఫైనాన్స్ రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు కనపిస్తాయన్నారు. గోల్డ్‌మ్యాన్ సాచ్స్ సర్వీసెస్ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవికృష్ణన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కొత్త సాంకేతికతలు, పరిష్కారాల అభివృద్ధికి పరిశ్రమ, విద్య భాగస్వామ్యాలు కీలకంగా ఉన్నాయన్నారు.

నిత్యారెడ్డి అరంగేట్రం



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో శనివారం నిత్యారెడ్డి భరతనాట్య అరంగేట్రం చేశారు. కేంద్ర సంగీత నాటక అవార్డు గ్రహీత కళారత్న పి.రామలింగశాస్త్రి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ దీపికారెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం నిత్యారెడ్డి గణపతి స్తుతితో ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను వేధించడం నేరం

పటాన్‌చెరు టౌన్: వృద్ధ మహిళలను వేధించడం నేరమని.. వారికి ఆర్థిక భరోసా, సామాజిక భద్రత కల్పించడం అందరి బాధ్యతని హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ప్రతినిధి సాంబరాజు అన్నారు. ప్రపంచ వృద్ధులపై హింస ,వేధింపుల నివారణ దినం సందర్భంగా శనివారం పటాన్‌చెరు మండలం ముత్తంగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంబరాజు మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే మానవత దృక్పథాన్ని అలవరుచుకోవాలని వృద్ధుల బాగోగులు చూసుకోవాలని కోరారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఎనిమిది మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేశారు.

నేడు 'ఐఎస్‌బీ'లో పుస్తకావిష్కరణ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఆదివారం నూతన పుస్తకావిష్కరణ కార్యక్రమం జరగనుంది. కేమ్కా ఆడిటోరియంలో సాయంత్రం 4.30 గంటలకు హరప్పా ఎడ్యుకేషన్ చైర్మన్, ఐఎస్‌బీ వ్యవస్థాపక డీన్ డాక్టర్ ప్రమత్‌రాజ్‌సిన్హా 'లెర్న్, డోన్ట్ స్టడీ' పేరిట రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్‌పిల్లుట్లతో డాక్టర్ సిన్హా ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది.

నూతన కార్యవర్గం

రాయదుర్గం: నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ప్రకటించారు .అధ్యక్షుడిగా సీకే మహ్మద్ షరీఫ్, ఉపాధ్యక్షులుగా రేష్మాసమల్, అంజన్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్ రచనారెడ్డి, అజయ్‌కుమార్, కార్యదర్శులుగా షైన్‌మారియా, బాసిల్ జార్జ్, మహ్మద్ ఫయాజుల్‌హక్, ముకుంద్‌కుమార్, శాశ్వత ఆహ్వానితులుగా అమల్ జోన్‌ఫిలిప్, సీఎం సునీల్‌కుమార్, చాణక్య, సయాజ్‌అబ్రహం, కోశాధికారిగా సంగీత్‌ఆర్‌నాయర్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్‌గా జర్నాపాధ్యాయ్, మహ్మద్‌నద్రన్, కార్యవర్గ సభ్యులుగా కెబిశ్రీరామ్, ఖాలీద్,శ్యాంసన్ గిడ్లా, దావిస్‌జేఅల్ఫ్రత్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సీకేమహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

నేడు 'మంచినీళ్ల పండుగ'

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆదివారం 'మంచినీళ్ల పండుగ' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఉదయం 10 గంటలకు మియాపూర్ డివిజన్‌లోని జేపీఎన్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు, ఉద్యమకారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జేపీఎన్‌నగర్‌లో..

మియాపూర్: డివిజన్ పరిధిలోని జేపీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మంచినీళ్ల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గాంధీ ఓ ప్రకటనలో తెలిపారు.

అలరించిన 'సిరిమువ్వ'



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సిరిమువ్వ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురువు అనువడ్ల శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో మూషికవాహన, బ్రహ్మామొక్కటే, చక్కని తల్లికి చాంగుభళ, పుష్పాంజలి తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు తాన్విక, చందన, జోషిని, యోగితా, మహశ్రీ, యశస్వీ, జస్మితా, సుదీప్తి, జాహ్నవి పాల్గొన్నారు.

ముగిసిన గ్రీన్‌థాన్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వేర్‌హౌజింగ్ కంపెనీ వెల్‌స్పన్ ఇండియా ఆధ్వర్యంలో బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ పేరుతో పర్యావరణ హిత ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల ముగింపు సందర్భంగా శనివారం సంస్థ ప్రతినిధులు వివరాలు తెలిపారు. గత కొన్ని రోజులుగా నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కూరగాయల మార్కెట్లలో గ్రీన్‌థాన్ పేరిట నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమాలు విజయవంతం అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వందలాదిగా వాలంటీర్లు పాల్గొన్నారన్నారు.

బోనాల పండగ నిధులకు దరఖాస్తు చేసుకోండి

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో బోనాల పండుగ నిర్వహణకు ఆలయ నిర్వాహకులు నిధులు పొందడానికి జూన్ 21 లోగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. గుడి పేరు మీద ఉన్న లెటర్ హెడ్, గుడి పేరు మీద ఉన్న బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, గుడి ఫొటోలు, దేవాలయ చైర్మన్ , కార్యదర్శి ఆధార్ కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.


గుట్టలబేగంపేట్‌లో పర్యటిస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు

కాలనీల్లో గడప గడపకూ బీజేపీ

మాదాపూర్: సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని గుట్టల బేగంపేట్, శ్రీరామకాలనీ, మేఘహిల్స్‌లలో శనివారం గడప గడపకు బీజేపీ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, చంద్రశేఖర్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, విజయ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు సర్టిఫికెట్ల పంపిణీ

గచ్చిబౌలి: పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించకపోతే పలు సమస్యలు ఉత్పన్నం అవుతాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో నిర్వహించిన పోటీలలో విజేతలకు శనివారం ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్ పర్యవేక్షణలో విజయకుమార్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు . కాగా పర్యావరణ పరిరక్షణ అంశంపై పోస్టర్ తయారీ, స్లోగన్ రైటింగ్, వీడియో మేకింగ్ పోటీలలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న దృశ్యం

బహిరంగ సభను విజయవంతం చేయండి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్


మాట్లాడుతున్న శ్రీకాంత్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: నరేంద్ర మోదీ 9 ఏళ్ల సుపరిపాలనపై 'మహాజన సంపర్క్ అభియాన్' కార్యక్రమం నేపథ్యంలో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 18వ తేదీ ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణం మహంకాళి ఆలయ సమీపంలో నిర్వహించే బహిరంగసభకు ముఖ్య అతిథిగా కేంద్ర మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి పురుషోత్తం రూపాల రానున్నారని తెలిపారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలని నిర్ణయించి జూన్ చివరివరకు అనేక కార్యక్రమాలను రూపొందించామన్నారు. ఈ బహిరంగ సభకు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కోకన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజుగోపాల్ యాదవ్, బీజేపీ జిల్లా కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామ సీపీఆర్.. రోగికి ప్రాణదానం

సాక్షి, సిటీబ్యూరో: ఛాతీలో నొప్పితో అత్యవసర సేవలు అవసరమైన రోగికి సీపీఆర్ ద్వారా ప్రాణదానం చేశారు సిటిజన్ ఆసుపత్రి వైద్యులు. నగరవాసి వెంకటేష్ (35)ని ఆకస్మిక ఛాతీనొప్పితో అపస్మారకస్థితిలో ఆసుపత్రి అత్యవసర విభాగంలోకి తీసుకురాగా పరిస్థితి తీవ్రతను గమనించిన వైద్యులు గంట పాటు సీపీఆర్ చేసి అపాయం నుంచి తప్పించారు. కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా.సుధీర్ కోగంటి, డా.నిఖిల్ భార్గవ్, డా.ప్రియాంక సీపీఆర్ చేశారు.

యోగానంద్ వాహనంపై దాడి

గచ్చిబౌలి పీఎస్‌లో కేసు నమోదు



గచ్చిబౌలి: బీజేపీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గజ్జెల యోగానంద్‌తో పాటు పార్టీ నాయకుల కార్లపై దాడి చేశారు. మీ సమస్య- మా పోరాటంలో భాగంగా శుక్రవారం రాత్రి 7.30 గంటలకు మసీద్‌బండలో పాదయాత్ర చేపట్టారు. వార్డు కార్యాలయం ముందు కార్లను పార్క్ చేశారు. యోగానంద్‌కు చెందిన ఫార్చ్యునర్‌తో పాటు బ్రీజా, ఎర్టిగా, స్విఫ్ట్ కార్లపై ఒక వర్గం వారు రాళ్లు విసరడంతో కార్ల అద్దాలు పగిలిపోయాయి. ఇరు వర్గాలు బాహాబాహికి దిగడంతో గచ్చిబౌలి పోలీసులు చెదరగొట్టారు. కాగా ఆదిత్య, అరుణ్ కుమార్ అనే వ్యక్తులు పాపిరెడ్డి కాలనీకి చెందిన బీజేపీ నాయకురాలు కాంచన తమపై, కార్లపై దాడి చేశారని గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ పుటేజీలు సేకరిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నృత్యార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శిఖర సౌమ్య శిష్యుల నృత్యార్చన ఆకట్టుకుంది. శిష్యులు అనికా, శారద, విష్ణు, చిన్మయి, సాయిరిత్విక, సంయుక్త, విష్ణు, సంజయ్, సాయిసాత్విక, సింధులు మూసికవాహన, కట్టెదురా వైకుంఠము, అదిగో అల్లదిగో ,తందనానా భళా అంటూ కళాకారులు అన్నమయ్య కీర్తనలకు చేసిన నృత్యం అలరించింది. కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని గంగారం విలేజ్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఈదమ్మ తల్లి, శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానానికి హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్ శనివారం లక్ష రూపాయలు విరాళంను దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దొంతి శేఖర్, వార్డు సభ్యులు వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, వీరేందర్, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న గౌతంగౌడ్

గిరిజన తండాలు ప్రగతి వికాస కేంద్రాలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపి తండాలను అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దిన మహా నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 16వ రోజు శనివారం అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ తండాలో తెలంగాణ గిరిజన దినోత్సవం వైభవంగా జరిగింది. గిరిజన మహిళలతో కలిసి ఎమ్మెల్యే నృత్యం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్ది పరిపాలనలోనూ వారికి సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమాల్లో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ మాధవి రవి, ఎంపీడీఓ మల్లీశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులు, తండావాసులు పాల్గొన్నారు.

25వ తేదీ లోపు రిపోర్ట్ చేయాలి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరం డిగ్రీ ప్రథమ సంవత్సరానికి మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. సెల్ఫ్ రిపోర్ట్ చేయని పక్షంలో ఆ సీటు కోల్పోతారన్నారు. మొదటి సంవత్సరం అడ్మిషన్‌కు రెండో విడత దోస్తు ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 26వ తేదీ రిజిస్ట్రేషన్‌కు తుది గడువని, 27వ తేదీన వెబ్ ఆప్షన్ గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు 9494507067 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

WANTED LADY TEACHERS
HIGH SCHOOL: Maths, Physics,Biology, Hindi.
Salary:20,000 to 35,000
For Above Posts Exp.is must
KPHB COLONY
9032858238, 8885343978

కారు ఢీకొని.. ఓఆర్ఆర్‌పై కార్మికుడి దుర్మరణం

పటాన్‌చెరు టౌన్ : ఓఆర్ఆర్‌పై లైన్ మార్కింగ్ చేస్తున్న కార్మికుడిని కారు ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం పటాన్‌చెరు పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెలరోజులుగా ఓఆర్ఆర్ రోడ్డుపై లైన్ మార్కింగ్ పనులు కొనసాగుతుండగా హజారిలాల్ అనే పెయింటర్ వద్ద రాజస్థాన్‌కు చెందిన సుభాష్ సైని(20) పనికి కుదిరాడు. శనివారం సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ నుంచి ముత్తంగి మధ్య లైన్ మార్కింగ్ పనులను హజారిలాల్, సుభాష్ సైని సహా మరికొంతమంది చేస్తున్నారు. శామీర్‌పేట్ వైపు నుంచి పటాన్‌చెరు వెళుతున్న కారు, ఇంద్రేశం సమీపంలో సైన్ బోర్డు, రేడియం సేఫ్టీ కోన్‌లను దాటి సుభాష్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓఆర్ఆర్ బ్రిడ్జిపై నుంచి పటాన్‌చెరు-దౌల్తాబాద్ వెళ్లే రోడ్డుపై పడి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠ్యపుస్తకాలు సిద్ధం

- ఈ ఏడాది నుంచి నోట్‌బుక్స్ కూడా అందజేత
- దశాబ్ది ఉత్సవాల్లో 20న అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేత


పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

శేరిలింగంపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మొత్తం 59 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను అందించనున్నారు. మండల విద్యాధికారి వెంకటయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందేలా చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు ప్రారంభించింది.

లక్ష అవసరం..

అందుబాటులో 74వేల పుస్తకాలు

- శేరిలింగంపల్లి మండలంలో 43 ప్రాథమిక పాఠశాలలు, మూడు యూపీఎస్, 13 జెడ్పీహెచ్ఎస్ స్కూల్స్ ఉండగా లక్ష పుస్తకాలు అవసరమవుతాయని అధికారుల అంచనా.
- అందుకు అణుగుణంగా మొదటి విడత 41వేల పుస్తకాలు రాగా రెండో విడత 33వేల పుస్తకాలు వచ్చాయి. రెండు విడతల్లో 74 వేల పుస్తకాలు రెడీ అయ్యాయి. ఇక చివరి విడతలో 26వేల పుస్తకాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఈ ఏడాది 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలను కూడా అందించనున్నారు.
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేరోజు పుస్తకాలను అందించేందుకు ప్రణాళిక రూపొందించారు.
- కాగా పాఠశాల తెరిచే రోజే విద్యార్థులకు నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్ అందించేలా ఏర్పాట్లు చేయాలి.

అన్ని ఏర్పాట్లు పూర్తి



శేరిలింగంపల్లిలోని 59 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న పుస్తకాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఈ ఏడాది 6 తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలను కూడా ఇవ్వనుంది.

– కె.వెంకటయ్య, మండల విద్యాధికారి, శేరిలింగంపల్లి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462